మనం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల,
నారాయణ పేట, వనపర్తి
గురువారం | 22 | అక్టోబర్ | 2026 | పేజీలు 11 | www.manamepaper.com



# సీఎం సొంతూరులో పండుగ శోభ

## కుటుంబ సభ్యులతో దసరా వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి రాకతో కొండరెడ్డిపల్లి గ్రామం కళకళ

సీఎం రాకతో అడుగడుగునా పులవర్షం... ఘనస్వాగతం

స్నేహితులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సీఎం ఇష్టాగోష్టి

దసరా వేడుకలు సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

దసరా వచ్చిందంటే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డి పల్లిలో గ్రామంలో పండుగ శోభ నెలకొంటది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం తన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా దసరా వేడుకల్లో పాల్గొన్నారు.





ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (మనం బ్యూరో) : స్వగ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, ముఖ్యమంత్రి పర్యటన స్థానికుల్లో ఉత్సాహాన్ని మరింత నింపింది.

### హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి రాక

దసరా వేడుకలకు సీఎం తమ స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా ముందుగా ప్రజాప్రతినిధుల ఘన స్వాగతం పలికారు. మంగళవారం నేరుగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో

- మిగతా 2లో..

# పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

## పనులు పూర్తి కాకుండా.. నీటిని ఎలా విడుదల చేస్తారు?

నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్ లోకి నీటిని విడుదల చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

అందుబాటులోకి అదనంగా లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

బీఆర్ఎస్ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదు

బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్



కొల్లాపూర్, 21అక్టోబర్ (మనం న్యూస్) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేశారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సాగునీటి

- మిగతా 4లో..

# సీఎం సొంతూరులో పండుగ శోభ





మొదటి పేజీ తరువాయి

కొండారెడ్డిపల్లికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ఓపెన్‌టాప్ జీపులో గ్రామంలోకి బయలుదేరారు. ఓపెన్ టాప్ జీపులో సీఎం బయలుదేరుతూ ప్రజలందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కొండారెడ్డిపల్లి గ్రామమంతా సీఎం రాకతో హర్షధ్వానాలు, బ్యాండు భజంత్రీలు, సన్నాయి వాయిద్యాలు, నృత్యాలు, బాజన కీర్తనలు చేసుకుంటు సీఎంకు ఘన స్వాగతం పలికారు. మార్గమధ్యంలో గ్రామస్థులు, మహిళలు, అభిమానులు సంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలుకుతూ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

### దప్పు చప్పుళ్లు, పూల జల్లులతో సీఎంకు స్వాగతం

ముఖ్యమంత్రి తన స్వగ్రామంలోకి ప్రవేశించగానే గ్రామస్థులు దప్పు చప్పుళ్లు, గజమాలలు, తీరొక్క పూల జల్లులతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు సంప్రదాయ బతుకమ్మలతో వేడుకలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. గ్రామీణ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలు ప్రతిబింబించేలా స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. ఓపెన్‌టాప్ జీపులో ప్రయాణిస్తూ ముఖ్యమంత్రి గ్రామ ప్రజలకు, చిన్ననాటి మిత్రులకు, అభిమానులకు అభివాదం చేశారు. గ్రామ పెద్దలు, స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడి వారి పలకరింపులకు స్పందించారు. పండుగ వేళ తమ మధ్యకు వచ్చిన ముఖ్యమంత్రిని చూసి గ్రామస్థులు ఆనందోత్సవాల మధ్య సీఎం రేవంత్ రెడ్డితో గడిపారు.

### శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు

కొండారెడ్డి పల్లి గ్రామంలోకి చేరుకున్న అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక శ్రీ ఆంజనేయ స్వామివారి దేవస్థానాన్ని ముందుగా సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి వేద పండితులు పూర్ణకుంభంతో, మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ముఖ్యమంత్రి స్వామివారిని ప్రార్థించారు.

### కొట్ల మైసమ్మ ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కొట్ల మైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### ముఖ్యమంత్రి జెమ్మి చెట్టుకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు

విజయదశమి వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి జెమ్మి చెట్టుకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా పండుగలో విశిష్ట ప్రాధాన్యం కలిగిన జెమ్మి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదానంతరం తోబుట్టువులు, చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులతో సరదాగా సీఎం ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అభిలషించారు.

### గ్రామస్థులు, చిన్ననాటి మిత్రులతో ఆత్మీయ పలకరింపులు

దసరా వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి తన చిన్ననాటి మిత్రులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వగ్రామంతో తనకున్న అనుబంధాన్ని చాటుతూ గ్రామస్థులతో స్నేహపూర్వకంగా గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలో విజయదశమి వేడుకల్లో పాల్గొనడం, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం, జెమ్మి పూజలో భాగస్వామి కావడం, గ్రామస్థులతో ఆత్మీయంగా మెలగడం ముఖ్యమంత్రి పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

### సంప్రదాయాలకు ప్రతీకగా విజయదశమి వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విజయదశమి పండుగకు విశిష్ట స్థానం ఉంది. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా కొండారెడ్డిపల్లిలో దసరా వేడుకలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, గ్రామస్థులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయం, సంతోషం, శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించారు.







# మంత్రి జూపల్లి సవాల్ కు సిద్ధం

## మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : నార్లాపూర్ నుండి ఎల్లూరు రిజర్వాయర్ కు నీళ్లు రావడం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయం ఫలితమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన సవాల్ ను స్వీకరిస్తున్నానని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను కేసీఆర్ ని అడిగి తూము పెట్టించడం వల్లనే ఏర్పాటు అయిందని తెలిపారు. గతంలో కేఎల్ఐ పథకంలో తక్కువ సామర్థ్యంతో నిర్మించిన కాల్వల వల్ల రైతులకు న్యాయం జరగాలంటే పాలమూరు-రంగారెడ్డి పథకంలో నార్లాపూర్ నుండి ఎల్లూరుకు, ఏదుల నుండి బుద్దారం కాలువకు, వట్టెం నుండి కల్వకుర్తి కాలువకు లింక్ చేయడం జరిగిందని, కాంగ్రెస్ అన్యాయాలను బీఆర్ఎస్ హయాంలో సరిదిద్దామని అన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీళ్లు ఉన్నాయని, చిత్తశుద్ధి ఉంటే ప్యాకేజీ-3లో అడ్డంగా ఉన్న మట్టిని తొలగించి నీరు పారనివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న పంపులు నడవడానికి ఇబ్బంది లేదని, ఏదుల, వట్టెంలో పంపులు సిద్ధంగా ఉన్నాయని, కరివెన వరకు నీళ్లు తీసుకెళ్లవచ్చని, ప్రతి రిజర్వాయర్ లో ఐదు టీఎంసీల నీరు నింపే అవకాశం ఉందని తెలిపారు. మూడేళ్లుగా పాలమూరు-రంగారెడ్డి పనులు ఆపి, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన టెండర్లను రద్దు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని సలహాదారులుగా పెట్టుకున్నారని, మంత్రి జూపల్లికి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు తప్ప పాలమూరు ప్రజల ప్రయోజనాలు పట్టవని విమర్శించారు. అధికారం ఉన్నా లేకున్నా పాలమూరు ప్రజల కోసం పోరాడుతామని తెలిపారు.



# బాపునగర్ ప్రీమియర్ లీగ్ సీజన్-6 విజయవంతం

**ఛాంపియన్‌గా ఎంవీఎం జూనియర్స్**

**యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సుమిత్ చంద్రకాంత్**



నారాయణపేట అక్టోబర్ 21(మనం న్యూస్): యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నారాయణపేటలోని బాపునగర్ మహర్షి విశ్వమిత్ర ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాపునగర్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) సీజన్--6 విజయవంతంగా ముగిసింది. గత నాలుగు రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. ఐదు జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో ఎంవీఎం జూనియర్స్, ప్రిన్స్ లెవన్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన పోరులో ఎంవీఎం జూనియర్స్ విజయం సాధించి 2026 సీజన్--6 ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్‌లో మెగా లెవన్, హిందూ యువసేన, ప్రిన్స్ లెవన్, కర్ణ ఫ్రెండ్స్, ఎంవీఎం జూనియర్స్ జట్లు పాల్గొన్నాయి. యువ ఆటగాళ్లతో కూడిన ఎంవీఎం జూనియర్స్ జట్టు సమష్టి కృషితో అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచింది. అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులను సైతం ఆశ్చర్యపరిచేలా యువ ఆటగాళ్లు తమ ప్రతిభను చాటుకున్నారు. జట్టుగా ఆడితే విజయాన్ని సొంతం చేసుకోవచ్చని నిరూపించారు.

**యువతకు అండగా సుమిత్ చంద్రకాంత్..**

బీపీఎల్ నిర్వహణలో గండే సుమిత్ చంద్రకాంత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ మొదటి బహుమతిగా నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్తులోనూ ఎన్ని సీజన్లు నిర్వహించినా తన సహకారం కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. టోర్నమెంట్ విజయవంతం కావడానికి పలువురు క్రీడాభిమానులు, ఆటగాళ్లు ముందుకొచ్చి బంతులు, వికెట్లు, ట్రోఫీలు, జెర్సీలను స్పాన్సర్ చేయడం నిర్వాహకుల్లో ఆనందాన్ని నింపింది. రెండో బహుమతిగా రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని నవీన్ (మహబూబ్‌నగర్) అందించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి సీనియర్ క్రీడాకారుడు హన్మంతు ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

**అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడాకారుడికి సత్కారం..**

బాపునగర్‌కు చెందిన డాలర్ భాను ప్రకాష్ అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న సందర్భంగా అతడిని సుమిత్ చంద్రకాంత్ శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో క్రికెట్‌లో మరింత రాణించేందుకు భాను ప్రకాష్‌కు క్రికెట్ కిట్ బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. అతడికి ఎలాంటి సహాయం అవసరమైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

**ఐదు జట్లకు టీషర్టుల స్పాన్సర్..**

టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్లకు లయన్స్ క్లబ్ నారాయణపేట అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, సాయి వెన్నెల బార్ అండ్ రెస్టారెంట్‌కు చెందిన శరణప్ప గౌడ్, మహేష్ బావికాడి, వినోద్ రెడ్డి, పల్లెరుచులు హోటల్‌కు చెందిన మహిపాల్ రెడ్డి టీషర్టులను స్పాన్సర్ చేశారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో సహకరించిన దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

**నాలుగు పదుల వయసులోనూ క్రీడలపై అదే మక్కువ..**

క్రికెట్‌పై ఉన్న మమకారంతో నాలుగు పదుల వయసులోనూ యువకులకు దీటుగా ఉత్సాహం చూపుతూ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సీనియర్ క్రీడాకారుడు హన్మంతు ముదిరాజ్‌ను క్రీడాకారులు అభినందించి సన్మానించారు. ఆయనతో పాటు కమలకాంత్ మఠం టోర్నమెంట్ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. నిర్వాహకుల సమన్వయం, దాతల సహకారం, క్రీడాకారుల ఉత్సాహంతో బీపీఎల్ సీజన్-6 విజయవంతంగా ముగిసింది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్థానిక ప్రతిభకు వేదికగా నిలుస్తున్న బాపునగర్ ప్రీమియర్ లీగ్ రానున్న రోజుల్లో మరింత ఘనంగా కొనసాగాలని క్రీడాభిమానులు ఆకాంక్షించారు.



# రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు సత్తా

**సబ్‌జూనియర్ బాలుర విభాగంలో రజత పతకం..**

**జూనియర్ బాలుర విభాగంలో విజేతగా నిలిచిన జిల్లా జట్టు**

నారాయణపేట అక్టోబర్ 21(మనం న్యూస్): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. నల్గొండ జిల్లా ఆలియా పట్టణంలోని టైమ్స్ స్కూల్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలుర నెట్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. అదేవిధంగా ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర నెట్‌బాల్ పోటీల్లోనూ జిల్లా జట్టు విజేతగా నిలిచి తమ ప్రతిభను చాటుకుంది. వరుస విజయాలతో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి-ంలో సత్తా చాటడం పట్ల జిల్లా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయాలపై నారాయణపేట జిల్లా నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేష్ శెట్టి, కార్యదర్శి డాక్టర్ రామ్ మోహన్ గౌడ్, డీవైఎస్ఓ ఎస్. వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు రాజారాం, లక్ష్మణ్, కోశాధికారి అంజనేయులు తదితరులు క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సాధించిన విజయాలు ఇతర క్రీడాకారులకు స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# పత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం

బీబీనగర్, అక్టోబర్ 21: (మనం న్యూస్) : రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండించే పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని TGSPDCL సీఎండీ జితేశ్ వి. పాటిల్ ఐఏఎస్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించి, భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# బ్రాహ్మణుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

**ఈ నెల 25న జడ్చర్లలో జరిగే బ్రాహ్మణ శంఖారావానికి భారీగా తరలిరావాలి**

**వారాణసి రాంప్రసాద్**



నారాయణపేట అక్టోబర్ 21(మనం న్యూస్) : బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితమై ఐక్యంగా ముందుకు సాగాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ వారాణసి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 25న జడ్చర్లలో నిర్వహించనున్న ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావానికి జిల్లా నలుమూలల నుంచి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని కోరారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఉత్తరాది మఠం, పరిమళాపురం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాల్లో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనాల్లో వారాణసి రాంప్రసాద్, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు కొల్లూర్ భీంసేన్ రావు పాల్గొని ప్రసంగించారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ నెల 25న జడ్చర్లలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో జరిగే బ్రాహ్మణ శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాది మఠం మేనేజర్ హరీష్ ఆచార్య, రాఘవేంద్ర స్వామి మఠం అర్చకులు కొల్హాపూర్ నరసింహ చారి, లక్ష్మీశోభాన భజన మండలి అధ్యక్షుడు యాద్గీర్ మంగళ విజయాచారి, కార్యదర్శి భళ్లారి విద్యుత్‌తో పాటు బ్రాహ్మణ సంఘం నాయకులు గోపీనాథ్ రావు, రఘునాథరావు, రవీంద్ర చారి, కొప్రేశా చారి, అనంతరావు, శేషగిరిరావు, మూర్తి, నారాయణరావు, అనిల్ దేశాయ్, దీపక్, అనిరుద్ధాచారి, నరహరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.



**బ్రాహ్మణ శంఖారావం కరపత్రాలు ఆవిష్కరించిన ఉడిపి స్వామీజీ..**

నారాయణపేట ఉత్తరాది మఠంలో ఉడిపి స్వామీజీ గోవింద తీర్థులు ఈ నెల 25న జడ్చర్లలో నిర్వహించనున్న బ్రాహ్మణ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో విష్ణు సహస్రనామ పారాయణం కొనసాగించాలని, తద్వారా ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. ధర్మాన్ని అనుసరిస్తూ బ్రాహ్మణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.




# పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు నీటిని విడుదల చేయాలని కోరడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్ లోకి మంత్రి జూపల్లి కృష్ణారావు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్ నుంచి 1000 క్యూసెక్కుల ద్వారా మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీటి సదు-పాయం కలగనుందని వివరించారు. సాగునీటితోపాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.నార్లాపూర్ నుంచి ఏదుల వరకు కాలువల తవ్వకం, బ్రిడ్జిల నిర్మాణం సహా కీలక పనులు ఇంకా కొనసాగుతున్నాయని, అవి పూర్తికాకుండా నీటిని విడుదల చేస్తే ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేస్తోందని, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సరికాదని అన్నారు.నార్లాపూర్ నుంచి ఏదుల వరకు కాలువల పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. మార్గమధ్యంలో మూడు చోట్ల తండు తవ్వకాలు చేపట్టాల్సి ఉండటంతోపాటు బ్రిడ్జిల నిర్మాణం కూడా కొనసాగుతోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రాతి నేల ఉండటంతో తవ్వకాలకు సమయం పడుతోందని వివరించారు. ఈ పనులు పూర్తికాకుండా నీటిని విడుదల చేస్తే మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాలువల నిర్మాణం పూర్తిచేసి నీటిని సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ నుంచి ఏదుల వరకు చేపట్టాల్సిన పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేసి ఉంటే ప్రస్తుత పరిస్థితి ఎదురయ్యేది కాదని జూపల్లి అన్నారు. మూడో ప్యాకేజీలో పనులను అసంపూర్తిగా వదిలేయడం వల్లే ప్రస్తుతం వాటిని పూర్తిచేయాల్సి వస్తోందని విమర్శించారు. గతంలో నిలిచిపోయిన పనులను ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని, కాలువల తవ్వకం, బ్రిడ్జిల నిర్మాణం కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పనులు పూర్తయ్యేందుకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోకుండా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మంత్రి అన్నారు. నీటిని విడుదల చేయాలని కోరడం సులువేనని, అయితే ఆ నీరు కాలువల ద్వారా ఎక్కడికి చేరుతుందో కూడా ఆలోచించాలని వ్యాఖ్యానించారు. నిర్మాణ పనులు పూర్తికాకుండా నీటిని విడుదల చేస్తే ఆశించిన ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించి వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని సూచించారు. గాలి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు6 మానుకోవాలని హితవు పలికారు. అసంపూర్తి పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# రామాలయంలో వేదయుక్తంగా శమీ పూజలు

**భక్తులచే సామూహిక విష్ణు సహస్ర పారాయణ పఠనం**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (2( మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో విజయదశమి పురస్కరించుకొని రామలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ వేదయుక్తంగా శనివారం శమీ పూజలు జమ్మి వృక్షం వద్ద నిర్వహించారు. అనంతరం జమ్మి వృక్షానికి భక్తులు సామూహిక ప్రదక్షిణ నిర్వహించి, ఒకరికి ఒకరు భక్తిశ్రద్ధలతో బంగారం జమ్మి ఆకులను పంచుకున్నారు. ఆలయం అంత పండగ శోభా అలంకరించింది. సీతారామచంద్ర స్వాముల వారికి ఉ దయం నుండి భక్తులకు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్థం రవీందర్, కాలనీవాసులు, విష్ణు, సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగ దసరా వేడుకలు

**వడ్డేమాన్ గ్రామంలో రచ్చకట్ట దగ్గర శమి పూజలు**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో విజయ దశమి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం కన్నుల పండుగగా దసరా వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రచ్చ కట్ట వద్ద ఏర్పాటు చేసిన శమీ పూజలు శనేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి వేద మంత్ర చరణాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు యువత ఒకరికి ఒకరు అభినందనలు తెలియజేస్తూ జమ్మి (బంగారం) ఆకులను పంపిణీ చేసుకున్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు వేదం ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, యువత, చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలలో పాల్గొన్నారు.

# సుభద్రమ్మ పాడె మోసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**సుభద్రమ్మ అంత్యక్రియల్లో నిరంజన్ రెడ్డి**



రేవల్లి, అక్టోబర్ 21 (మనం న్యూస్): రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం తిరుపతి రెడ్డి మాతృమూర్తి నాగం సుభద్రమ్మ మృతి పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సుభద్రమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన తన సతీమణి వాసంతితో కలిసి బుధవారం నాగపూర్ గ్రామంలోని ఆమె నివాసానికి చేరుకున్నారు. సుభద్రమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సాన-ుభూతి తెలిపారు. సుభద్రమ్మ అంత్యక్రియల్లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొనడమే కాకుండా పాడె మోశారు. మాతృమూర్తిని కోల్పోయిన నాగం తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రేవల్లి మాజీ జడ్పీటీసీ భీమయ్య, శివరాం రెడ్డి, చీటి రాజుల నర్సింహా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



# ప్రజల మధ్యకు సీఎం రేవంత్‌రెడ్డి

**జడ్చర్లలో దసరా దుమ్మురేపిన అనిరుధ్‌రెడ్డి!**

**పదివేలకు పైగా జనసందోహంతో అంబరాన్నంటిన విజయదశమి సంబరాలు**

**డాక్టర్ బి.ఆర్.ఆర్. మైదానం జనసంద్రం!**

**ముఖ్యమంత్రి రాకతో వేడుకలకు రాజకీయ కళ**

**ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



పండుగను ప్రజా ఉత్సవంగా మార్చిన జడ్చర్ల! పాలమూరు అక్టోబర్ 21(మనం న్యూస్) : పండుగ అంటే నాలుగు గోడల మధ్య పూజలు చేసుకోవడం మాత్రమే కాదు.. ప్రజలంతా ఒక్కచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం! నాయకులు వేదికలపై ప్రసంగించడం మాత్రమే కాదు.. ప్రజల మధ్యకు వచ్చి వారి సంతోషాల్లో భాగస్వాములు కావడం! ఈ భావనకు అద్దం పట్టేలా జడ్చర్లలో విజయదశమి సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొనడం, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పదివేలకు పైగా ప్రజలు తరలిరావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం జనసందోహంతో కళకళలాడింది. పండుగ సందడి, ప్రజల ఉత్సాహం, నాయకుల రాకతో జడ్చర్లలో దసరా వాతావరణం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఒకవైపు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విజయదశమి.. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక.. ఇంకోవైపు నియోజకవర్గ ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ప్రయత్నం.. ఈ పరిణామాలన్నీ కలిసి జడ్చర్ల దసరా వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని తీసుకొచ్చాయి. ఇది కేవలం పండుగ కార్యక్రమం మాత్రమే కాదు.. ప్రజల భాగస్వామ్యం, రాజకీయ ప్రాధాన్యం, సామాజిక ఐక్యత కలగలిసిన వేడుకగా స్థానికంగా చర్చనీయాంశమైంది.

**సీఎం రేవంత్‌రెడ్డి రాకతో జడ్చర్లకు ప్రత్యేక ఆకర్షణ!**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయదశమి వేడుకల్లో పాల్గొనడంతో జడ్చర్ల సంబరాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యమంత్రి ప్రజల మధ్యకు రావడం, పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పదివేలకు పైగా ప్రజలు పాల్గొన్న ఈ వేడుకలు పండుగల నిర్వహణలో సామూహిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం పెరుగుతున్న విషయాన్ని చాటిచెప్పాయి. విజయదశమి అంటే చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. కొత్త ఆశలకు, కొత్త సంకల్పాలకు, విజయపథంలో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిచ్చే పర్వదినం. అలాంటి పండుగ వేళ ముఖ్యమంత్రి పాల్గొన్న కార్యక్రమం జడ్చర్ల ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించింది. పండుగ వాతావరణంలో నాయకులు, ప్రజలు పరస్పరం పలకరించుకోవడం, శుభాకాంక్షలు తెలియజేసుకోవడం వేడుకలకు ఆత్మీయతను జోడించింది. ముఖ్యమంత్రి పాల్గొన్నారన్న కారణంతోనే కార్యక్రమం ప్రత్యేకత ముగిసిపోలేదు. భారీ సంఖ్యలో ప్రజలు ఒకేచోట చేరడం, సంప్రదాయ పండుగను సామూహిక వేడుకగా నిర్వహించడం కూడా ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

**ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అంటేనే ప్రత్యేక శైలి!**

జడ్చర్ల రాజకీయాల్లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తనదైన శైలితో ముందుకు సాగుతున్నారనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ప్రజలను కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, నియోజకవర్గ స్థాయి-లో ప్రత్యేక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తనదైన గుర్తింపు తెచ్చుకోవాలనే ప్రయత్నం ఆయన చేస్తున్నారని అనుచరులు చెబుతున్నారు. విజయదశమి వేడుకల్లోనూ ప్రజల భాగస్వామ్యమే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పండుగను కొందరికే పరిమితం చేయకుండా ప్రజలంతా కలిసి జరుపుకునే వాతావరణం కనిపించింది. సాధారణంగా పండుగలు కుటుంబాలు, బంధుమిత్రుల మధ్య జరుపుకుంటారు. కానీ వేలాది మంది ఒకే వేదికపై చేరి సంబరాలు చేసుకోవడం ఆ పండుగకు సామూహిక రూపాన్ని తీసుకొచ్చింది. ప్రజల మధ్య ఉండటం ఒక రాజకీయ నాయకుడికి కనిపించే గుర్తింపు కావచ్చు.. కానీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన నాయకత్వానికి కొలమానం! పండుగ వేళ ప్రజలతో మమేకం కావడం ఎంత ముఖ్యమో, పండుగ ముగిసిన తర్వాత వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటి సమన్వయమే ప్రజాప్రతినిధులపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచుతుంది.

**పదివేలకు పైగా ప్రజలు.. జనసందోహంతో కళకళలాడిన మైదానం!**

జడ్చర్లలోని డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన విజయదశమి సంబరాలకు పదివేలకు పైగా ప్రజలు హాజరైనట్లు నిర్వాహకుల సమాచారం. భారీ జనసమీకరణతో మైదానం పండుగ సందడిని సంతరించుకుంది. ప్రజల రాకతో కార్యక్రమ ప్రాంగణం కళకళలాడింది. పండుగను ఒక సామూహిక వేడుకగా నిర్వహించాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం, ఒకే వేదికపై పండుగ ఆనందాన్ని పంచుకోవడం ఈ వేడుకలకు ప్రధాన బలంగా నిలిచాయి. రాజకీయ కార్యక్రమాల్లో నాయకుల ప్రసంగాలు, పార్టీ జెండాలు, నినాదాలు కనిపించడం సహజం. కానీ పండుగ వేడుకల్లో ప్రజల ఆనందం, ఆత్మీయ పలకరింపులు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం ఉండాలి. జడ్చర్ల విజయదశమి సంబరాలు ఈ అంశాలను ముందుకు తీసుకొచ్చాయని స్థానికంగా చర్చ సాగుతోంది.

**ప్రజల ప్రేమే బలం.. ప్రజల ఆశీర్వాదమే నిజమైన ఆస్తి!**

విజయదశమి సంబరాల్లో భాగస్వాములైన ప్రజలకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేసినట్లు సమాచారం. ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు తనకు ఎంతో విలువైనవని, ప్రజలతో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందాన్ని ఇస్తుందని ఆయన సందేశం సారాంశం. ఒక ప్రజాప్రతినిధికి ప్రజల అభిమానం గొప్ప బలం. అయితే ఆ అభిమానం వెనుక ప్రజల ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు కూడా ఉంటాయి. ప్రజలు చూపించే ప్రేమను గౌరవించడం అంటే వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం. ఇచ్చిన హామీలను నెరవేర్చడం, ప్రజా సమస్యలపై స్పందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ద్వారా ఆ విశ్వాసానికి న్యాయం చేయాలి. ప్రజల చప్పట్లు నాయకుడికి ఉత్సాహాన్నిస్తాయి.. ప్రజల సమస్యల పరిష్కారం నాయకుడికి నిజమైన గౌరవాన్ని తెస్తుంది! పండుగ వేడుకల్లో కనిపించే ప్రజాభిమానం పాలనలోనూ ప్రజాసంక్షేమంగా ప్రతిఫలించినప్పుడే ప్రజాప్రతినిధి ప్రయాణానికి మరింత అర్థం చేకూరుతుంది.

**రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకమా? జడ్చర్ల సంబరాలపై చర్చ!**

తెలుగు రాష్ట్రాల్లో విజయదశమి వేడుకలు గ్రామగ్రామాన, పట్టణపట్టణాన వివిధ రూపాల్లో నిర్వహిస్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, జమ్మి ఆకుల పంపిణీ, కుటుంబ సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు దసరా పండుగలో భాగంగా కొనసాగుతుంటాయి. అయితే జడ్చర్లలో ముఖ్యమంత్రి పాల్గొనడం, పదివేలకు పైగా ప్రజలు ఒకే వేదికపై చేరడం ఈ కార్యక్రమానికి స్థానికంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి వేడుకలు మరెక్కడా జరగలేదని నిర్ధారించడానికి సమగ్ర పోలికలు అవసరం. అయినప్పటికీ, జడ్చర్లలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యం, ముఖ్యమంత్రి పర్యటన, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సంబరాల కారణంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ జనసందోహం.. పండుగ ఉత్సాహం.. ముఖ్యమంత్రి రాక.. ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే.. ఇవన్నీ కలిసి జడ్చర్ల దసరా వేడుకలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యాన్ని తీసుకొచ్చాయి.

**ముగింపు: జడ్చర్ల దసరా సందడి.. నాయకుల రాక.. ప్రజల ఆశల పండుగ!**

విజయదశమి అంటే చెడుపై మంచి విజయం. చీకటిపై వెలుగు విజయం. నిరాశపై ఆశ విజయం. జడ్చర్లలో నిర్వహించిన విజయదశమి సంబరాలు పండుగ ఆనందాన్ని, తెలంగాణ సంస్కృతిని, ప్రజల సామూహిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబించాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనడంతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడగా, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రజలతో కలిసి పండుగను జరుపుకోవడం కార్యక్రమానికి ఆత్మీయతను జోడించింది. పదివేలకు పైగా ప్రజలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపిన ఈ వేడుకలతో డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం పండుగ సందడితో కళకళలాడింది. అయితే ఈ సంబరాల అసలైన విజయం జనసందోహంతో మాత్రమే కొలవలేం. ప్రజల జీవితాల్లో సంతోషం పెరిగిందా? వారి సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నాయా? అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయా? అన్న ప్రశ్నలకు పాలన సమాధానం చెప్పాలి. వేడుకల్లో కనిపించే ఉత్సాహం అభివృద్ధిలోనూ కనిపించాలి.. వేదికలపై వినిపించే భరోసా ప్రజల జీవితాల్లో నిజం కావాలి.. ప్రజల ప్రేమకు పాలకులు చేసే సేవే తగిన ప్రతిఫలం కావాలి! జడ్చర్లలో అంబరాన్నంటిన విజయదశమి సంబరాలు పండుగ శోభతో పాటు ప్రజల ఆకాంక్షలను మరోసారి గుర్తుచేశాయి. ప్రజల ఐక్యత మరింత బలపడాలి. జడ్చర్ల అభివృద్ధి కొత్త పుంతలు తొక్కాలి. తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగాలి. ప్రతి ఇంటా సంతోషం.. ప్రతి కుటుంబంలో సౌభాగ్యం.. ప్రతి పల్లెలో అభివృద్ధి.. ప్రతి ప్రజా జీవితంలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి!





గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే

# నాగవరం ప్రీమియర్ లీగ్

**ఆనందోత్సాహాల మధ్య ముగిసిన నాగవరం ప్రీమియర్ లీగ్ సీజన్-3**

**నిర్వాహకులు యాదగిరి, శ్రీకాంత్**

**విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన జర్నలిస్ట్ బాలస్వామి మల్యాల**

వనపర్తి అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే విజయదశమిని పురస్కరించుకుని నాగవరంలో నాగవరం ప్రీమియర్ లీగ్ సీజన్-3ను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించామని నిర్వాహకులు యాదగిరి, శ్రీకాంత్, రాఘవేందర్, శేఖర్, అభిలాష్, భాస్కర్ లు తెలిపారు. ఈ సీజన్ లో రాక్-11 టీం ట్రోఫీని కైవసం చేసుకుందని, ట్రోఫీతో పాటు నగదు బహుమతిని నీరజ్ ముదిరాజ్ స్పాన్సర్ చేశారని వారు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ జర్నలిస్ట్ బాలస్వామి మల్యాల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. రన్నరప్ జట్టుకు బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. ట్రోఫీ దాత నీరజ్ ముదిరాజ్ మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడోత్సవాలను భవిష్యత్తులో కూడా ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, గోపాల్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# దసరాకు బగ్గుమన్న ఏదుల!

**-సర్పంచ్ పరశురాములు యాదవ్ ను అవమానపరిచిన అగ్రవర్ణ పెద్దలు**

**-సర్పంచ్ జమ్మి వృక్షానికి పూజ చేయించిన అగ్రవర్ణాలు**

**-అగ్రవర్ణాల పెత్తనంపై ఆందోళన వ్యక్తం చేసిన గ్రామస్తుల**

**-శమీ పూజలో కుల విభేదాలు**

**-బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**-ఎంపీడీవో, డీఎల్పీవోలు చర్యలు తీసుకోవాలి**



ఉమ్మడి గోపాలపేట, అక్టోబర్ 21 (మనం న్యూస్) : ఆనందం, సంతోషాలు నిండే దసరా పండుగ వేళ ఏదుల గ్రామం బగ్గుమంది. దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులంతా రంగురంగుల దుస్తులు ధరించి జమ్మి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన వేళ బీసీ బిడ్డకు అవమానం ఎదురైంది. నిబంధనల ప్రకారం గ్రామ సర్పంచ్ తోనే పూజా కార్యక్రమాలు చేయాల్సి ఉండగా, అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది పెద్దలు కల్పించుకుని, గ్రామ ప్రథమ పౌరుడు, బీసీ బిడ్డ అయిన సర్పంచ్ పరిశరాములు యాదవ్ కు సమాచారం కూడా ఇవ్వకుండా వారి ఇష్టానుసారంగా పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ అవమానంపై ఏదుల గ్రామం ఒక్కసారిగా భగ్గుమంది. "బీసీ బిడ్డ సర్పంచ్ అయితే ఇలా అవమానిస్తారా?" అంటూ గ్రామ ప్రజలంతా ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు. మంగళవారం విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టు వద్ద అధికారికంగా చేయాల్సిన శమీ పూజకు సర్పంచ్ కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, కొంతమంది అగ్రవర్ణ భావజాలం కలిగిన నాయకులు ముందుగానే సొంతంగా పూజ చేసుకోవడం అత్యంత అవమానకరం, అప్రజాస్వామికం. "ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. రాజ్యాంగం ఇచ్చిన పదవిని, ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ పీఠాన్ని అవమానించడమే" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ బిడ్డ ఒకరు సర్పంచ్ అయితే జీర్ణించుకోలేని కొందరి కుల అహంకారానికి ఇది నిదర్శనమని, ఇలాంటి చర్యలు గ్రామ ఐక్యతకు గొడ్డలిపెట్టు అని అన్నారు. ఈ ఘటనపై MPDO, DLPO లు వెంటనే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, బాధిత సర్పంచ్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది పరశురాం యాదవ్ కు జరిగిన అవమానం కాదు, ఏదుల గ్రామ ప్రజలందరికీ జరిగిన అవమానమని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.




# మనిగిల్ల చరిత్రలో మొదటిసారి రావణ దహనం

**-సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**



పెద్దమందడి అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : మండల పరిధిలోని మనిగిల్ల గ్రామంలో దసరా పండగ సందర్భంగా మొదటిసారిగా రావణ దహన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించామని గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దుర్గామాత, స్వామివారి పల్లకి సేవ, డప్పు కళాకారుల డప్పుల మోతతో, బొడ్డెమ్మలతో, భాజా భజంత్రీలతో, భజనలతో ఊరేగింపుగా శ్రీ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం జమ్మి చెట్టుకు శమీ పూజను ఘనంగా నిర్వహించి గ్రామ చరిత్రలోనే మొదటిసారిగా రావణ దహన కార్యక్రమాన్ని అద్భుతంగా జరుపుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అశేషంగా భక్తులు హాజరై విజయవంతం చేశారని అన్నారు. గ్రామంలో మొదటిసారిగా రావణ దహన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ పెద్దలకు, సోదరులకు, మిత్రులకు, మహిళా మణులకు, యువకులకు హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పోతుల రామిరెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వనపర్తిలో సంప్రదాయబద్ధంగా దసరా ఉత్సవాలు

**శమీ వృక్షానికి ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి పూజలు చేసిన రాజా కృష్ణదేవరావు**

వనపర్తి, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తిలో దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని రాజావారి ఆస్థానంలో జరిగిన ఈ వేడుకల్లో వనపర్తి రాజా కృష్ణదేవరావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. రాజవంశీయుల ఆచారాల ప్రకారం రాజావారి గృహం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నల్లచెరువు కట్టపై ఉన్న జమ్మి వృక్షం వద్దకు చేరుకుంది. అనంతరం రాజా కృష్ణదేవ రావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన విజయదశమి సందర్భంగా జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం అందించుకోవడం శుభప్రదంగా పరిగణిస్తారు. ఈ సంప్రదాయం స్నేహసౌహార్దాలకు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. పూజల అనంతరం స్థానికులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి జమ్మి ఆకులను అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాజవంశీయుల వారసత్వ ఆచారాలను ప్రతిబింబించిన ఈ వేడుకలు వనపర్తి ప్రాంత సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పోలీసు అమర వీరుల త్యాగాలు మరవలేనివి

**జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి**





వనపర్తి, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : తమ కుటుంబాన్ని వదిలి ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి అన్నారు. బుధవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిలతో కలిసి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక పోలీసు యూనిఫాం వెనుక కూడా ఒక తండ్రి, కొడుకు, భర్త ఉంటారని, అయినా విధి పిలిచినప్పుడు వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగం చేశారని అన్నారు. 1959లో లడఖ్ లో 10 మంది జవాన్ల బలిదానం నుండి నేటి వరకు ఎంతో మంది ప్రజల కోసం అమరులయ్యారని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని, వారి సేవల వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. యువత అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ మెరుగైన సేవలు అందించడమే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరచిపోదని అన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, ఏవో సునంద, సిఐలు సుగంధ రత్నం, ఓడి రమేష్, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఆర్ఐ లు శ్రీనివాస కుమార్, అప్పలనాయుడు, పట్టణ ఎస్సై హరిప్రసాద్, రూరల్ ఎస్సై రిషికేష్ పాల్గొన్నారు.







# 50 వసంతాల వేడుకను వచ్చే ఏడాది ఘనంగా జరుపుకుందాం

**వనపర్తి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందాం**

**షమీ పూజలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : వచ్చే ఏడాది 50 వసంతాల వేడుకను ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన షమీ పూజలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. విజయదశమి పర్వదినాన శమీ వృక్షాన్ని పూజించడం అత్యంత పుణ్యప్రదమని శాస్త్రాలు చెబుతున్నాయి. పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలను శమీ వృక్షంపై దాచి, విజయదశమి రోజున తిరిగి తీసుకుని విజయం సాధించారని పురాణ కథనం. అందుకే ఆ రోజున శమీ పూజ చేయడం వల్ల శత్రు దోషాలు తొలగి, విజయం, ఐశ్వర్యం, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతారు. అదే సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఎమ్మెల్యే కుటుంబం స్వామివారి సన్నిధిలో షమీ పూజ నిర్వహించారు. పూజలో ఎమ్మెల్యే సతీమణి శారదా రెడ్డి, కుమారులు నవనీత్ రెడ్డి, మనోజ్ రెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబానికి ధర్మకర్త రఘునాథాచార్యులు స్వాగతం పలికి, వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శమీ పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వనపర్తి పట్టణ వైభవానికి ప్రతీక అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేవాలయం కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాక, ప్రజలకు మానసిక ప్రశాంతతను ఇచ్చే దివ్యధామమని అన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఆలయ 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలను పట్టణ ప్రజలు, భక్తులందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఎస్‌ఎల్ఎన్ రమేష్, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దసరా పండుగ వేళ తీరని విషాదం

**కాల్వలో గల్లంతై చెన్నకేశవులు మృతి**

మిడ్జిల్ అక్టోబర్ 21 (మనం న్యూస్) : పండుగ పూట ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాల్సిన వేళ.. అయ్యవారిపల్లి గ్రామంలో మాత్రం తీరని విషాదం అలుముకుంది. దసరా పండుగ రోజున జరిగిన విషాద ఘటన ఒక కుటుంబంలో చీకట్లు నింపింది. భార్య ధనలక్ష్మికి గాజులు, కమ్మలు ఇప్పించి ఆమె ముఖంలో చిరునవ్వు చూడాలనుకున్న గంగాపురం చెన్నకేశవులు చివరకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మిడ్జిల్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గంగాపురం చెన్నకేశవులు సోమవారం కాలువలో గల్లంతయ్యారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయన ఆచూకీ కోసం ఆందోళన చెందుతున్న సమయంలో మంగళవారం ఉదయం ఆయన మృతదేహం లభ్యమైంది. ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్యకు గాజులు, కమ్మలు.. చివరకు కన్నీళ్లే మిగిలాయి. భార్య ధనలక్ష్మికి గాజులు, కమ్మలు ఇప్పించి ఆమె సంతోషాన్ని చూడాలనుకున్న భర్త.. ఇక లేడన్న నిజాన్ని ఆమె ఎలా తట్టుకోగలదు? తనతో జీవితాంతం తోడుగా ఉంటాడనుకున్న భర్త ఒక్కసారిగా దూరమవడంతో ధనలక్ష్మి గుండె పగిలేలా విలపిస్తోంది. భర్త ప్రేమగా ఇప్పించిన గాజులు, కమ్మలు ఆమెకు ఇప్పుడు మధుర జ్ఞాపకాలతో పాటు తీరని బాధను గుర్తుచేస్తున్నాయి. దసరా పండుగకు ఇంటికి ఆనందంగా తిరిగి వస్తాడని ఎదురుచూసిన కుటుంబానికి ఆయన మృతదేహం రూపంలో విషాద వార్త అందింది. పండుగ సందడి ఉండాల్సిన ఇంట్లో ఇప్పుడు కన్నీళ్లు, రోదనలు మాత్రమే మిగిలాయి. తండ్రి ప్రేమకు దూరమైన కుమారుడి భవిష్యత్తును తలచుకుని గ్రామస్తులు సైతం కంటతడి పెడుతున్నారు.



# మిడ్జిల్‌లో ఇళ్ల మధ్యే మద్యం మంటలు

**విద్యార్థినుల భద్రత గాలిలో కలిసిందా?**

**రేణుక ఎల్లమ్మ వైన్స్‌పై నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు**

**ఎదురుగా బెల్ట్ షాపులు, సిట్టింగుల వ్యవహారంపై తీవ్ర విమర్శలు!**

**పాఠశాలలకు వెళ్లే దారిలో మద్యం హడావుడి అంటూ స్థానికుల ఆవేదన**

**మహిళలు, బాలికల భద్రతపై ఆందోళన.. అధికారుల తనిఖీలు ఎక్కడ?**

**ఆరోపణలపై తక్షణ విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని ప్రజల డిమాండ్**




మిడ్జిల్, అక్టోబర్ 21 (మనం న్యూస్) : ఒకవైపు బడికి వెళ్లే చిన్నారులు.. మరోవైపు మద్యం మత్తులో రహదారులపై హడావుడి! ఒకవైపు మహిళల భద్రతపై ఆందోళన.. మరోవైపు జనావాసాల మధ్య మద్యం విక్రయాలపై ఆరోపణలు! మిడ్జిల్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైన్స్ ఎదురుగా బెల్ట్ షాపులు, సిట్టింగులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖలు ఏం చేస్తున్నాయన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.మద్యం విక్రయాలకు అనుమతి ఉన్నంత మాత్రాన ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులను పట్టించుకోకుండా ఉండవచ్చా? పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు భయాందోళనలకు గురవుతున్నారన్న ఫిర్యాదులు వస్తే అధికారులు స్పందించాల్సిన బాధ్యత లేదా? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని స్థానికులు అంటున్నారు.

### ఇళ్ల మధ్య వైన్స్.. ప్రజలకు ప్రశాంతత కరువైందా?

మండల కేంద్రంలోని జనావాసాల మధ్య కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసరాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం కొనుగోలుకు వచ్చే వారి రద్దీ, పరిసరాల్లో గుమిగూడటం, అక్కడే మద్యం సేవిస్తున్నారన్న ఫిర్యాదులతో కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని చెబుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలన్నా, అదే దారిలో ప్రయాణించాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల ఆవేదన. కుటుంబాలు నివసించే ప్రాంతంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయన్న ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. ప్రజలు నివసించే ప్రాంతాల్లో ప్రశాంతతకు భంగం కలుగుతోందన్న ఫిర్యాదులను ఎవరు పట్టించుకోవాలి? సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? ఇవే ఇప్పుడు మిడ్జిల్‌లో వినిపిస్తున్న ప్రశ్నలు.

### విద్యార్థినుల రాకపోకలకు ఇబ్బందులంటూ ఆరోపణలు.. స్పందించేదెవరు?

ఈ వ్యవహారంలో అత్యంత సున్నితమైన అంశం విద్యార్థుల భద్రత. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విద్యార్థినులు ఇదే రహదారిని వినియోగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వైన్స్ పరిసరాల్లో కొందరు గుమిగూడటం, మద్యం సేవిస్తున్నారన్న ఆరోపణలతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో పిల్లలు ఇలాంటి వాతావరణాన్ని దాటుకుంటూ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తే వారి తల్లిదండ్రుల్లో ఆందోళన కలగడం సహజం. బాలికలు ఎలాంటి భయం లేకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు కల్పించడం అధికారుల కనీస బాధ్యత కాదా? విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఫిర్యాదులపై విచారణ జరపడానికి ఇంకెంత సమయం కావాలి? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని, అవసరమైతే పాఠశాలల రాకపోకల వేళల్లో పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### వైన్స్ ఎదురుగా బెల్ట్ షాపులా? సిట్టింగుల వెనుక అసలు కథేంటి?

రేణుక ఎల్లమ్మ వైన్స్ ఎదురుగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని, అక్కడ మద్యం సేవించేందుకు సిట్టింగులు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అనుమతుల పరిధిని దాటి మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? బహిరంగంగా మద్యం సేవించేందుకు ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై ఎక్సైజ్ శాఖ సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ఆ విషయాన్ని కూడా అధికారులు స్పష్టంగా వెల్లడించాలి. ఫిర్యాదులు వస్తున్నా తనిఖీలు నిర్వహించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరగడం సహజం. అయితే, బెల్ట్ షాపులు, సిట్టింగుల నిర్వహణపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. వైన్స్ నిర్వాహకుల వాదనతో పాటు సంబంధిత శాఖల వివరణను కూడా పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.

### మహిళల భద్రతపై భరోసా ఎక్కడ?

మహిళలు, బాలికలు, వృద్ధులు నిర్భయంగా రాకపోకలు సాగించలేని పరిస్థితులు ఉన్నాయన్న ఫిర్యాదులు వస్తే వాటిని సాధారణ సమస్యగా చూడలేం. మద్యం సేవించిన కొందరి ప్రవర్తన వల్ల అసౌకర్యం ఎదురవుతోందన్న ఆరోపణలపై పోలీసులు విచారణ జరపాలి. ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యకలాపాలు జరుగుతున్నాయా? బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారా? మహిళలు, విద్యార్థినుల భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నాయా? అన్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలి.

మహిళల భద్రత అనేది మాటలకే పరిమితం కాకూడదు.. విద్యార్థినుల రక్షణ కాగితాలకే పరిమితం కావద్దు! ఫిర్యాదులపై స్పందించి, అవసరమైన చోట నిఘా పెంచి, ప్రజలకు భరోసా కల్పించడమే అధికారుల ముందున్న తక్షణ కర్తవ్యం.

### అధికారులు మేల్కొనేది ఎప్పుడు?

మిడ్జిల్ మండల కేంద్రంలో ప్రజల భద్రత, విద్యార్థుల రాకపోకలు, మహిళల రక్షణకు సంబంధించిన అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వైన్స్ నిర్వహణ నిబంధనలను ఎక్సైజ్ శాఖ పరిశీలించాలి. అక్రమ మద్యం విక్రయాల ఆరోపణలపై తనిఖీలు నిర్వహించాలి. బహిరంగ మద్యం సేవనం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయా అనే అంశాన్ని పోలీసులు పరిశీలించాలి. విద్యార్థులు వినియోగించే రహదారిపై భద్రతా పరిస్థితులను సమీక్షించాలి.

ఆరోపణలు ఎదురైనప్పుడు వాటిని నిర్ధారించకుండా ఎవరినీ దోషిగా ప్రకటించడం సరికాదు. అదే సమయంలో ఫిర్యాదులను పట్టించుకోకుండా వదిలేయడం కూడా బాధ్యతాయుతమైన పాలన అనిపించుకోదు. విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

### ప్రజల డిమాండ్లు ఇవే!

– రేణుక ఎల్లమ్మ వైన్స్ అనుమతులు, నిర్వహణ నిబంధనలపై తక్షణ తనిఖీలు చేపట్టాలి.

– వైన్స్ ఎదురుగా బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరపాలి.

– బహిరంగ మద్యం సేవనం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యకలాపాలను అరికట్టాలి.

– పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విద్యార్థినుల రాకపోకల భద్రతను పరిశీలించాలి.

– మహిళలు, స్థానికుల ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలి.

– నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– చేపట్టిన తనిఖీలు, విచారణ ఫలితాలను ప్రజలకు వెల్లడించాలి.

### ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే!

మిడ్జిల్‌లో రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసరాల్లో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదురవుతున్న కార్యకలాపాలపై అధికారులు ఎప్పుడు విచారణ చేపడతారు? విద్యార్థినులు, మహిళల భద్రతపై ఎప్పుడు స్పష్టమైన భరోసా కల్పిస్తారు? బెల్ట్ షాపులు, సిట్టింగుల ఆరోపణలపై వాస్తవాలు ఎప్పుడు బయటపడతాయి? ఇవి ఎవరో ఒకరిని లక్ష్యంగా చేసుకుని సంధిస్తున్న ప్రశ్నలు కావు.. ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలన్న సామాజిక బాధ్యత నుంచి వస్తున్న ప్రశ్నలు. మద్యం విక్రయాలకు అనుమతి ఉండొచ్చు.. కానీ ప్రజల ఇబ్బందులను విస్మరించడానికి ఎవరికీ అనుమతి లేదు! విద్యార్థుల భద్రత, మహిళల రక్షణ, స్థానికుల ప్రశాంత జీవనం విషయంలో అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి. ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకోవాలి.. వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేయాలి. మిడ్జిల్ ప్రజలు కోరుకుంటున్నది ఒక్కటే –విద్యార్థులు భయం లేకుండా బడికి వెళ్లాలి.. మహిళలు నిర్భయంగా రాకపోకలు సాగించాలి.. జనావాసాల్లో ప్రశాంతత నెలకొనాలి. ఈ కనీస భరోసాను కల్పించడంలో సంబంధిత శాఖలు ఇకనైనా చురుకుగా వ్యవహరిస్తాయా అన్నది వేచి చూడాలి.

---



## ఘనంగా రాజరాజేశ్వరీ దేవి ఊరేగింపు

మిడ్జిల్, అక్టోబర్ 21(మనం న్యూస్): దసరా నవరాత్రులలో భాగంగా మిడ్జిల్ మండల కేంద్రంలో వివిధ గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి దేవి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వివిధ ప్రధాన ఆలయం నుండి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఈదమ్మ గడ్డ తండాలో దసరా సంబరాల సందడి

**గిరిజన మహిళలతో కలిసి స్టెప్పులేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి!**

**సంప్రదాయ నృత్యాలతో మార్మోగిన తండా.. గిరిజనుల ఆనందోత్సాహాల్లో పాలుపంచుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే**

**సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట.. ఆత్మీయ కలయికతో పండుగకు మరింత కళ**



రాజాపూర్ అక్టోబర్ 21(మనం న్యూస్) : దసరా పండుగ వేళ ఈదమ్మ గడ్డ తండాలో సంబరాలు అంబరాన్నంటాయి. పల్లె సంస్కృతి, గిరిజన సంప్రదాయాలు, జానపద కళలు ఉట్టిపడేలా సాగిన వేడుకల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొని సందడి చేశారు. గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేస్తూ పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే తమ మధ్యకు వచ్చి తమతో కలిసి నృత్యం చేయడంతో తండా వాసుల్లో ఆనందం వెల్లివిరిసింది.

**గిరిజన మహిళలతో కలిసి నృత్యం.. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ!**

బాలానగర్ మండలంలోని ఈదమ్మ గడ్డ తండాలో నిర్వహించిన దసరా వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా సాగాయి. పండుగ సందర్భంగా గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో సందడి చేయగా, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం వారితో కలిసి అడుగులు కలిపారు. సాధారణంగా అధికారిక కార్యక్రమాలకే పరిమితమయ్యే వాతావరణానికి భిన్నంగా, స్థానిక ప్రజలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొనడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గిరిజన మహిళలతో ఆత్మీయంగా మమేకమైన ఎమ్మెల్యే వారి నృత్యాల్లో భాగస్వామ్యం కావడంతో తండాలో పండుగ సందడి మరింత పెరిగింది. సంప్రదాయ సంగీతం, జానపద నృత్యాలు, ప్రజల ఉత్సాహం కలగలిసి ఈదమ్మ గడ్డ తండాలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

**గిరిజన సంస్కృతికి ప్రతిబింబంగా దసరా వేడుకలు**

దసరా అనేది కేవలం పండుగ మాత్రమే కాదు.. ప్రజల మధ్య ఆత్మీయతను పెంచే, తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను గుర్తుచేసే వేడుక. ముఖ్యంగా గిరిజన తండాల్లో నిర్వహించే పండుగలు స్థానిక జీవనశైలి, జానపద కళలు, సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈదమ్మ గడ్డ తండాలో జరిగిన వేడుకలు సైతం గిరిజన సంస్కృతిలోని ప్రత్యేకతను చాటిచెప్పాయి. గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కార్యక్రమానికి హాజరైన వారితో ఆనందాన్ని పంచుకున్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి పండుగల్లో భాగస్వామ్యం కావడం ద్వారా స్థానిక సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిచ్చే సందర్భంగా ఈ వేడుక నిలిచింది.

**తండాలో పండుగ సందడి.. ప్రజల్లో ఉత్సాహం**

ఎమ్మెల్యే రాకతో ఈదమ్మ గడ్డ తండాలో దసరా వేడుకలకు మరింత సందడి నెలకొంది. గిరిజన మహిళలతో కలిసి ఆయన నృత్యం చేయడం వేడుకల్లో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. సంప్రదాయాలను కాపాడుకుంటూ, సామూహికంగా పండుగలను జరుపుకోవడం ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల సాంస్కృతిక వైభవం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఈదమ్మ గడ్డ తండాలో దసరా వేడుకలు గిరిజన సంప్రదాయాల వైభవాన్ని చాటడంతో పాటు, ప్రజలతో కలిసి పండుగను జరుపుకున్న సందర్భంగా నిలిచాయి.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**గువ్వలోనిపల్లి - పెనిమెళ్ల మధ్య బైక్ అదుపుతప్పి ప్రమాదం**

**తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి**

ఉప్పునుంతల, అక్టోబర్ 21 (మనం న్యూస్) : మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఎస్ ఐ మహేష్ వివరాల ప్రకారం సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. బల్మూర్ మండలం తుమ్మెన్‌పేట గ్రామానికి చెందిన బతికే మల్లేష్ అలియాస్ మల్లయ్య (41) బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా డిండి నుంచి అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామానికి తన హోండా యూనికార్న్ బైక్ పై బయలుదేరాడు. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో ఉప్పునుంతల మండలంలోని గువ్వలోనిపల్లి – పెనిమెళ్ల గ్రామాల మధ్య ప్రధాన రహదారిపైకి చేరుకోగానే బైక్ ఒక్కసారిగా అదుపుతప్పింది.

దీంతో వాహనంపై నుంచి బలంగా కిందపడిపోవడంతో మల్లేష్ తలకు, కుడి కణత భాగానికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చీకటి సమయం కావడంతో స్థానికులు గుర్తించే సమయానికే ప్రాణాలు పోయాయి. సమాచారం అందుకున్న ఉప్పునుంతల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య బతికే మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ ఐ మహేష్ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



# వెంకట్‌రెడ్డిపల్లిలో రెడ్డి సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు**

మహమ్మదాబాద్, అక్టోబర్ 21 (మనం న్యూస్): మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామ రెడ్డి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్డి సేవా సంఘం మండల అధ్యక్షుడు రాంపురం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మరికంటి బాలవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా విజయశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా బి. వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా న్యాయవాది రామ్‌రెడ్డి, చెన్నారెడ్డి, సురేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, హనుమంత్‌రెడ్డి, సాయి తేజరెడ్డిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మరికంటి బాలవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలోని పేద కుటుంబాలకు విద్య, వైద్యం, ఆరోగ్య పరంగా అండగా నిలవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రెడ్డి సోదరుల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, అవసరమైన వారికి రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మొరంబాయి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల, జిల్లా స్థాయి కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# పేదింటి ఆణిముత్యం కళ్యాణి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**5 కి.మీ. సైక్లింగ్‌లో ప్రథమ స్థానం.. సిద్ధిపేటలో జరిగే పోటీలకు అర్హత**



మహమ్మదాబాద్, అక్టోబర్ 21 (మనం న్యూస్): పేదింట పుట్టినా.. ప్రతిభలో మాత్రం ముందంజలో నిలిచింది ఓ బాలిక. పట్టుదలతో సైకిల్ తొక్కుతూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌కు చెందిన రుక్కంపల్లి కళ్యాణి తన క్రీడా ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం ఆధ్వర్యంలో ఈ నెల 10న మక్తల్‌లోని ఎల్లమ్మకుంట--కొత్త గార్లపల్లి రోడ్డులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు జిల్లాల నుంచి 126 మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో కళ్యాణి 5 కిలోమీటర్ల రోడ్ స్పీడ్ సైక్లింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు బి. గోపాలం చేతుల మీదుగా మెడల్, మెరిట్ సర్టిఫికెట్ అందుకుంది. తాజాగా ఈ నెల 21న సిద్ధిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 సైక్లింగ్ పోటీలకు కళ్యాణి ఎంపికైనట్లు సమాచారం అందిందని ఆమె తల్లి రుక్కంపల్లి సంజమ్మ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ కళ్యాణి విజయపతాకం ఎగురవేయాలని ఆకాంక్షిస్తున్నారు.

# శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**అచ్చంపేట పట్టణంలో ఘనంగా శమీ పూజలు**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (మనం బ్యూరో) : నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం విజయదశమి పురస్కరించుకొని శమీ పూజ కార్యక్రమాలు ఘనంగా



నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసు నాగరాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మలు, ఆటపాటలు ఆడారు. ఈ కార్యక్రమంలో భక్త మార్కండేయ శివాలయ కమిటీ అధ్యక్షుడు దాసు నాగరాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, మహిళా సంఘం అధ్యక్షులు పులిజాల కళ్యాణి, చిలివేరు ధనరాజ్, కర్నాటి రాములు, చిలివేలు శ్రావణి, కోట ప్రశాంతి, పులిజాల అంజలి కుమార్, గంజి జగదీశ్వర్ లతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎనిమిదవ ప్రపంచ సాహితీ మహోత్సవ గోడపత్రిక విడుదల

**శ్రీశ్రీ కళావేదిక నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మండికారి బాలాజీ**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (మనం బ్యూరో) : ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎనిమిదవ అంతర్జాతీయ సాహితీ మహోత్సవ వేడుకలు నవంబర్ ఒకటవ తేదీన నిర్వహించడం జరుగుతుందని శ్రీశ్రీ కళావేదిక నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మండికారి బాలాజీ అన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సాదేరాజు చేతుల మీదుగా గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మండికారి బాలాజీ మాట్లాడుతూ.... దేశభాషలందు తెలుగు లెస్స అన్న మాటలను నిజం చేస్తున్న శ్రీ శ్రీ సాహితీ సంస్థ ఈ ఉత్సవాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. తెలుగు భాష మాధుర్యం వెలకట్టలేనిదన్నారు. తెలుగు భాష కోసం రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష అభివృద్ధి మరింత ముందుకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు భాష వైభవాన్ని కీర్తిని చాటుతున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో అదేవిధంగా జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం నిర్వహణలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. జరగబోయే కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుండి ప్రజలు వేలాది మంది తెలుగు సాహిత్య కళాకారులు, కవులు పాల్గొననున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు నరసింహారావు, మాజీ కౌన్సిలర్లు మనోహర్, ఆకుల వెంకటేష్, మొక్తాల రేణుక, శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యదర్శి బీమా చారి, లక్ష్మణ్, శివ చారి, విష్ణు యాదవ్, రైటర్ వినయ్, మహేష్ లతోపాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# మాధురికి ముదిరాజ్ సంఘం సన్మానం

మాగనూర్ అక్టోబర్ 21(మనం న్యూస్ ) : మాగనూర్ మండల కేంద్రంలో ముదిరాజ్ బలిమెని ఆంజనేయులు కూతురు మాధురి ఎం బి బి యస్ సీట్ సాధించిన సందర్భంగా ముదిరాజ్ సంఘం తరపున సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పంజానూర్ ఆంజనేయులు, బేకరీ ఆంజనేయులు,సర్పంచ్ తనయుడు దండు సత్యప్ప, బస్వారాజ్, వెంకటేష్,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు



# దసరా ముగిసినా.. దుర్గమ్మపై భక్తి తరగలేదు!

**కన్నుల పండువగా అమ్మవారి శోభాయాత్ర.. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం**

**అమ్మవారిని సాగనంపుతూ భావోద్వేగానికి గురైన భక్తులు..**

**రజితా రెడ్డి కీలక పాత్ర.. మహిళల భక్తి నినాదాలతో మార్మోగిన ఆధ్యాత్మిక వాతావరణం!**



పాలమూరు అక్టోబర్ 21(మనం న్యూస్) : దసరా పండుగ ముగిసింది.. నవరాత్రుల సందడి సద్దుమణిగింది.. ఉత్సవాల కోలాహలం క్రమంగా తగ్గింది.. కానీ భక్తుల గుండెల్లో కొలువుదీరిన దుర్గమ్మపై భక్తి మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు! తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని పూజిస్తూ, పూలతో అలంకరిస్తూ, దీపాలు వెలిగిస్తూ, భక్తిపారవశ్యంలో మునిగిపోయిన భక్తులు.. అమ్మవారిని సాగనంపే వేళ భావోద్వేగానికి లోనయ్యారు. కన్నుల నిండా అమ్మవారి రూపాన్ని నింపుకుంటూ, మనసారా ప్రార్థిస్తూ నిర్వహించిన శోభాయాత్ర భక్తిభావాన్ని చాటిచెప్పింది. అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**అమ్మవారిని సాగనంపే వేళ.. భక్తుల కళ్లలో భక్తి.. గుండెల్లో భావోద్వేగం!**

అమ్మవారి ఉత్సవం అంటే కేవలం పూజలు, పూల అలంకరణలు, దీపాల వెలుగులు మాత్రమే కాదు.. అది భక్తుల నమ్మకానికి ప్రతీక! కష్టాల్లో ధైర్యాన్నిచ్చే తల్లి.. కన్నీళ్లలో ఓదార్పునిచ్చే దైవం.. కుటుంబం బాగుండాలని కోరుకునే ప్రతి హృదయానికి కొండంత భరోసా దుర్గమ్మ! అలాంటి అమ్మవారిని శోభాయాత్రగా సాగనంపే క్షణాలు భక్తులకు ప్రత్యేకమైన అనుభూతిని కలిగించాయి. ఉత్సవాలు ముగుస్తున్నాయన్న భావన ఒకవైపు.. అమ్మవారి ఆశీస్సులు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలన్న విశ్వాసం మరోవైపు.. ఈ రెండింటి మధ్య భక్తులు అమ్మవారికి భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. అమ్మవారి నామస్మరణతో సాగిన యాత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది. అనంతరం సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.

పండుగ ముగిసింది.. కానీ అమ్మపై ప్రేమకు ముగింపు ఎక్కడుంది?

దసరా తొమ్మిది రోజులే కావచ్చు.. కానీ దుర్గమ్మపై భక్తి మాత్రం జీవితాంతం కొనసాగే నమ్మకం! ఉత్సవాల సమయంలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంత పవిత్రమో.. ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా ఆ తల్లి ఆశీస్సులను తలచుకోవడం అంతే ప్రత్యేకం. అందుకే అమ్మవారిని సాగనంపుతున్న సమయంలో భక్తుల మనసుల్లో ఎన్నో భావాలు వెల్లివిరిశాయి. "అమ్మా.. మా కుటుంబాలను చల్లగా చూడు.. మా పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వు.. అనారోగ్యాలు, కష్టాలు తొలగించి అందరికీ సుఖశాంతులు ప్రసాదించు.. వచ్చే ఏడాది మళ్లీ నీ ఉత్సవాలను మరింత వైభవంగా జరుపుకునే భాగ్యం కల్పించు" అంటూ భక్తులు మనసారా ప్రార్థించారు. భక్తుల విశ్వాసంలో అమ్మవారు కేవలం విగ్రహం కాదు.. కష్టసమయంలో గుర్తుకొచ్చే ధైర్యం.. చీకటిలో వెలుగునిచ్చే ఆశ.. జీవిత ప్రయాణంలో తోడుగా నిలిచే నమ్మకం!

**శోభాయాత్రలో మహిళల భాగస్వామ్యం.. రజితా రెడ్డి కీలక పాత్ర**

దుర్గమ్మ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఉత్సవాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రజితా రెడ్డి కీలక పాత్ర పోషించారు. నిర్మల, అంబిక, రాజేశ్వరి, తేజావతి, చంద్రకళ, సువర్ణ, ప్రేమీల తదితరులు శోభాయాత్రలో పాల్గొని అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. మహిళల భాగస్వామ్యంతో సాగిన ఈ కార్యక్రమం భక్తి, ఐక్యత, సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచింది. అమ్మవారిని పూజించడం నుంచి శోభాయాత్ర నిర్వహణ వరకు భక్తులు చూపిన ఆసక్తి ఉత్సవాల పట్ల వారికున్న అనుబంధాన్ని ప్రతిబింబించింది. సమష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక వేడుకల్లో మహిళల పాత్ర మరోసారి స్పష్టమైంది.

**భక్తి వెనుక ఒక నమ్మకం.. ప్రతి ఇంటి వెనుక ఒక ప్రార్థన!**

అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనే ప్రతి భక్తుడి వెనుక ఒక ఆశ ఉంటుంది.. ప్రతి ప్రార్థన వెనుక ఒక కోరిక ఉంటుంది.. ప్రతి మొక్కు వెనుక ఒక కుటుంబం క్షేమంగా ఉండాలన్న ఆకాంక్ష ఉంటుంది. ఎవరో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలని కోరుకుంటారు.. మరెవరో ఆరోగ్యం కోసం ప్రార్థిస్తారు.. ఇంకొందరు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని అమ్మవారిని వేడుకుంటారు. ఇలా ఎన్నో ఆశలు, ఎన్నో ఆకాంక్షలు అమ్మవారి పాదాల చెంత చేరుతాయి. దుర్గమ్మ ఉత్సవాలు అలాంటి నమ్మకాలకు వేదికగా నిలుస్తాయి. భక్తులు ఒకచోట చేరి పూజలు నిర్వహించడం, శోభాయాత్రలో పాల్గొనడం, నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తిచేయడం ద్వారా సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. తరాలు మారినా.. కాలం మారినా.. అమ్మవారిపై భక్తి, కుటుంబ క్షేమంపై ఆశ, దైవంపై నమ్మకం మాత్రం చెక్కుచెదరని భావన ఈ వేడుకల్లో కనిపించింది.

**భక్తి ఎంత ముఖ్యమో.. భద్రత కూడా అంతే ముఖ్యం!**

శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులందరూ క్రమశిక్షణ పాటించడం అవసరం. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. యాత్రలో తొందరపాటు, తోపులాటలకు దూరంగా ఉండి, నిర్వాహకుల సూచనలు పాటించాలి. భక్తి ఉత్సాహం ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా, అందరూ సురక్షితంగా కార్యక్రమాల్లో పాల్గొనేలా పరస్పర సహకారం అందించాలి.

**వేడుకలకు విరామం.. భక్తికి కాదు!**

దసరా ముగిసింది.. శోభాయాత్ర పూర్తయింది.. నిమజ్జనంతో ఉత్సవాలకు తెరపడింది.. కానీ దుర్గమ్మ నామస్మరణ మాత్రం భక్తుల హృదయాల్లో నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అమ్మవారి రూపం కనులముందు లేకపోయినా.. ఆ తల్లిపై నమ్మకం మనసుల్లో నిలిచే ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా వెలిగించిన దీపాలు ఆరిపోయినా.. భక్తి అనే దీపం ప్రతి ఇంటా వెలుగుతూనే ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. "అమ్మా.. మళ్లీ నీ ఉత్సవాలు వచ్చే వరకు మా కుటుంబాలను చల్లగా చూడు.. మా జీవితాల్లో వెలుగులు నింపు.. ప్రతి ఇంటా సంతోషం, ప్రతి హృదయంలో ప్రశాంతత, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నింపాలి" అన్న భక్తుల ప్రార్థనల మధ్య దుర్గమ్మ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం భక్తిపూర్వకంగా ముగిసింది. దసరా ఉత్సవాలకు ముగింపు ఉండొచ్చు.. దుర్గమ్మపై భక్తికి మాత్రం ఎప్పటికీ ముగింపు లేదు!

# అచ్చంపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేసులో గడదాస్ వెంకటేశ్వర్లు?

- వంగూర్, చారగొండ మండలాలలో విస్తృత పర్యటన
- బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలను కలిసిన ప్రొఫెసర్





ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 21 (మనం బ్యూరో) : అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యే స్థాయిలో సరైన నాయకుడు లేకపోవడం పట్ల ప్రజలు మంచి నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నారు. అధిష్ఠానం అచ్చంపేట నియోజకవర్గం వైపు నేటికీ నాయకత్వం పగ్గాలు ఇవ్వకపోవడం పట్ల ఎవరికి వారు యమునా తీరు అన్నట్లుగా కొంతమంది బీఆర్ఎస్ పార్టీ నుండి నాకే టికెట్ కన్ఫామ్ చేస్తారని ఆత్మవిశ్వాసంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తిరుగుతూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇదే తరుణంలో స్థానికుడైన గడదాసు వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో అచ్చంపేట నియోజకవర్గంలో ప్రతి మండలం తిరుగుతూ ముఖ్య నేతలకు కలుస్తూ దూకుడు పెంచుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే రేసులో నేనుంటానని, అధిష్ఠానాని మెప్పించి ఒక్కసారి స్థానికుడినైనా నాకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీలో బలమైన నాయకులను, కార్యకర్తలను కలుస్తున్నారు. బుధవారం నియోజకవర్గంలోని చారగొండ, వంగూర్ మండలాలలో ప్రముఖ ముఖ్య నాయకులను కలిసి వారితో సుదీర్ఘంగా మాట్లాడడం జరిగింది. ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని బీఆర్ఎస్ పార్టీ నేతలతో చర్చించడం జరిగింది. అందుకు సానుకూలంగా ఆయా మండలాల నాయకులు చెప్పడంతో మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రొఫెసర్ గడదాసు వెంకటేష్ పార్టీని బుజస్కందాలపై మోయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అధిష్ఠానం ఒక్కసారి అవకాశం ఇస్తే అచ్చంపేట నియోజకవర్గంలో గులాబీ జెండా రెపరెపలాడే విధంగా క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకవెళ్తానని తెలిపారు.





## రాజరాజేశ్వరి అవతారంలోని దుర్గాదేవికి పూజలు

చౌటుప్పల్, అక్టోబర్ 21 (మనం న్యూస్) : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజరాజేశ్వరి అవతారంలోని దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారి చీరల వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న విజేతలకు చైర్ పర్సన్ అమ్మవారి చీరలను అందజేశారు. వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, ధర్మకర్తలు వర్కాల రవిగౌడ్, ఆవుల యేసుయాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ, మాజీ ధర్మకర్త ఉప్పుల కుసుమ, బొబ్బిళ్ళ శ్రీరాములు, మునుకుంట్ల సత్యనారాయణగౌడ్, సుర్వి నర్సింహాగౌడ్, బొడిగె బాలకృష్ణగౌడ్, ఉప్పల దీపిక, దాడి పద్మ, మామిడి రాములు, దాకోజీ శ్రీనివాస్, గడ్డిపాటి విజయలక్ష్మి, తేలుకుంట్ల వసంత, ఎర్రగోని భాస్కర్, అన్నమోని నవనీత, బొబ్బిళ్ళ సామ్రాట్, గంజి నాగరాజు, కాసోజు మధు, సోనునాయక్, రోహిత్ మిత్రా పాల్గొన్నారు.



# దసరా వైభవం...పులకించిన పుడమి

### అలై బలై..ఆత్మీయరాగం

### బతుకమ్మతో పరవశించిన పల్లె..ప్రకృతి ఉయ్యాలో

### నింగి నేల..సంగమం

ఊరుకొండ అక్టోబర్ 21 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలో పలు గ్రామాలలో దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి. బుధవారం ఆటపాటలతో అలాయి బలై కార్యక్రమంతో పుడమి పులకించిపోయింది. శరత్కాలపు వెన్నెల వెలుగుల్లో, ప్రకృతి కాంత పచ్చని పట్టుచీర కట్టినట్లుగా పుడమి పులకించిపోయే మహోత్సవం దసరా. అనాదిగా వస్తున్న సంస్కృతికి, అసమానమైన ఆధ్యాత్మిక ప్రతీకకు నిలువెత్తు రూపం ఈ విజయదశమి. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా, భక్తిభావనల పరిమళాలు వెదజల్లుతూ, ఆబాలగోపాలాన్ని ఆనంద డోలికల్లో ఓలలాడించే పండుగ ఇది. పులకించిన పుడమి. ప్రకృతి పరవశం వర్షరుతువు వీడ్కోలు పలికి, శరదృతువు స్వాగతం పలికే వేళ, విశ్వమంతా ఒక దివ్యమైన కాంతితో శోభిల్లుతుంది. తుమ్మెద ఝంకారాలు, కనకాంబరాల సింగారాలు, బతుకమ్మ పూల జాతరల నడుమ తెలంగాణ నేల పులకించిపోతుంది. ప్రకృతి పూజకు పీఠం వేస్తూ, గౌరమ్మను కొలుస్తూ సాగే ఈ సంబరం, సకల చరాచర సృష్టిలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపుతుంది. తొమ్మిది రాత్రులు నవదుర్గలుగా జగన్మాతను అర్చించి, అమ్మవారి దివ్య అనుగ్రహాన్ని పొందేందుకు భక్తుల హృదయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగిపోతాయి. విజయదశమి వైభవం. సంప్రదాయాల సమ్మేళనం విజయదశమి నాటికి ప్రకృతి కోలాహలం అంబరాన్నంటుతుంది. ఆయుధ పూజల అర్చనలు, శమీ వృక్షాల వందనాలు ఈ పండుగ విశేషాలు. "శమీ శమయతే పాపం..." అంటూ జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దల చేతుల్లో పెట్టి ఆశీస్సులు అందుకోవడం, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం తెలుగువారి సాంప్రదాయ వైశిష్ట్యానికి నిదర్శనం. ప్రతి ఇల్లూ తోరణాలతో, ప్రతి గుమ్మం రంగవల్లులతో కనువిందు చేస్తుంది. నట్టింట నవధాన్యాల మొలకల తోరణాలు, లక్ష్మీ కటాక్షానికి సూచికగా నిలుస్తాయి. అలై..బలై ఆత్మీయరాగం..



బంధాల అనురాగం

దసరా పండుగ విశిష్టత కేవలం పూజలతోనే ముగిసిపోదు. ఈ మహోత్సవానికి మకుటాయమానమైనది, మానవతా విలువలను చాటిచెప్పేది. అలై బలై. కోపతాపాలు వీడి, పగలు ప్రతీకారాలు మరిచి, అంతరాలను తుడిచిపెట్టి పరస్పరం ఆలింగనం చేసుకునే ఆత్మీయ వేదిక ఇది. 'అలై-బలై' అంటే కేవలం కౌగిలింత కాదు, అది హృదయాల కలయిక. అహాన్ని వీడి, స్నేహాన్ని చాటే ఒక అపురూప భావన. కులమతాల గీతలను చెరిపేస్తూ, పేద-ధనిక బేధాలను మరిచేలా చేస్తూ, అందరం ఒక్కటే అనే సత్యానికి ఈ పండుగ అద్దం పడుతుంది. ఈ ఆత్మీయరాగంలో ద్వేషాలు కరిగిపోతాయి, ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయి. దసరా వైభవం అంటే కేవలం పటాసుల సవ్వడి కాదు, అది అంతరంగంలో వెలిగే జ్ఞానదీప్తి. పుడమి పులకించేలా ప్రకృతిని ప్రేమించడం, అలై..బలై ఆత్మీయతతో తోటి మానవుడిని గౌరవించడం ఈ పండుగ మనకు అందించే పరమార్థం. ప్రకృతి పులకించింది. పల్లె పరవశించింది. శరదృతువు వేళ, అశ్వయుజ మాసపు అమావాస్య సాక్షిగా తెలంగాణ పల్లెల్లో సౌందర్యల హరివిల్లు విరిసింది. గునుగు తంగేడు చామంతి కట్ల పూల సువాసనలు దిక్కు దిక్కులన్నీటా విలజల్లుతుంటే, పల్లె జనం అంత ఒక్కటై తల్లి బతుకమ్మను సాగనంపే సంబరంలో మునిగిపోయారు. ప్రకృతిని పూజించే ఈ మహోత్సవంలో పల్లె హృదయం సాహిత్యమై ప్రవహించింది. పల్లె పడుచుల గొంతుకల నుంచి, జాలువారిన పాటలు అనంతమై తత్వ నిధిని ఆవిష్కరించాయి.

నెత్తిమీద సూర్యుడా ఉయ్యాలో...
నెల వన్నె కాడ ఉయ్యాలో...
తాకట్ల చంద్రుడా ఉయ్యాలో...
తిరొక్క పూలతో ఉయ్యాలో...

ఈ అమృత చరణాలు కేవలం ఆట కోసం పాడినవి కావు, పగటివేళ భానుడు కాంతిని కురిపించి, రాత్రివేళ అమృత కిరణాలు కురిపించే చంద్రుడి చల్లదనాన్ని తమ పాటల్లో బంధించారు. నింగిలో సూర్యచంద్రులను సైతం నేల మీదికి దింపి తాము పేరుస్తున్న తీరొక పూల బతుకమ్మల నడుమ సాక్షాత్కరింపజేసే అద్భుతమైన బందా భావ్యమిది. ప్రకృతి శక్తులైన సూర్యచంద్రులను సాక్షులుగా నిలబెట్టి తమ సౌభాగ్యాన్ని పల్లె సుభిక్షాన్ని కాపాడమని వేడుకునే ఆర్తి ఇందులో ధ్వనిస్తుంది. పాట ముగిసింది. ఆట చాలించారు. చెరువు ఒడ్డున బతుకమ్మలను సాగనంపుతున్న వేళ, పల్లె కళ్ళు కన్నీటితో చెమ్మగిల్లాయి. పోయిరావమ్మా బతుకమ్మ, మళ్లీ ఏడకల్లా రావమ్మ అంటూ, సాగిన వీడ్కోలు పలుకులు గుండెలను పిండేసాయి. ప్రకృతికి మానత్వానికి నడుమ ఉన్న అవిభక్త బంధానికి ఈ బతుకమ్మ పండుగ నిదర్శనం. ఈ శరత్కాల శోభ పల్లె గుండెల్లో నిరంతరం నిలిచి ఉండే ఒక మధుర స్వప్నం. ఒక దివిటి భవిష్యత్తుకు శుభ సూచిక. ఈ విజయదశమి సమాజంలో సమిష్టి తత్వాన్ని, ప్రతి గుండెలో ఆనందాన్ని నింపాలని, ఆ జగన్మాత ఆశీస్సులు అందరిపై ప్రసరించాలని ఆకాంక్షిద్దాం.